భారతదేశం.. జనాభా పెరుగుదల

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ జన సంఖ్యలో రెండోస్థానంలో ఉంది. స్వాతంత్ర్యానంతరం పెరుగుతున్న దేశ జనాభా విధాన నిర్ణేతలకు పెద్ద సమస్యగా పరిణమించింది. దాంతో జనాభా పెరుగుదల ఆర్థిక, సాంఘిక ప్రగతికి అవరోధంగా మారుతుందని భావించి... దాన్ని అరికట్టేందుకు అవసరమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా 1952లో కుటుంబ సంక్షేమ పథకాలను ప్రోత్స హించాలని నిర్ణయించి జనాభా విధానాన్ని ప్రకటించారు. అప్పటి నుంచి జనాభా నియంత్రణ లేదా స్థిరీకరణ.. దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధి అజెండాలో అంతర్భాగంగా ఉంది!

స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో.. దేశ జనాభా 345 మిలియన్లు. కాగా 2001 లెక్కల ప్రకారం.. 1029 మిలియన్లకు పెరిగింది. జూలై 1, 2007 నాటికి భారత జనాభా 1134 మిలియన్లకు చేరుకుందని అంచనా. అంటే.. 1947 తర్వాత దాదాపు 789 మిలియన్ల మంది పెరిగారు. దీనిని బట్టి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో జనాభా పెరుగుదల చాలా వేగవంతమైందని చెప్పవచ్చు. ఏటా 2 శాతం చొప్పున జనాభా వృద్ధి రేటు... 35 సంవత్సరాల్లో జన సంఖ్యను రెట్టింపు చేస్తుంది. ఈ స్థితి మన దేశంలో సంభవించింది. 1951లో మనదేశ జనాభా 361 మిలియన్ల నుంచి... 1986లో 763 మిలియన్లకు పెరిగింది. 1951 నుంచి 1961 మధ్యకాలంలో.. అదనంగా పెరిగిన జనాభా 78 మిలియన్లు అయితే.. 1991 నుంచి 2001 మధ్యకాలంలో... జనాభా వృద్ధిరేటులో కొద్దిపాటి తగ్గుదల సంభవించినప్పటికీ.. 183 మిలియన్ల మంది అదనంగా వచ్చి చేరారు.

2035-40 నాటికి మనదేశం జనాభాలో చైనాను అధిగమిస్తుందని అంచనా. స్వాతంత్ర్యానంతరం 4 రాష్ట్రాల్లో జనాభా వృద్ధి ఎక్కువగా ఉంది. ఇవి బీహార్ (జార్ఖండ్‌తో కలిపి), మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గఢ్‌తో కలిపి), రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ (ఉత్తరాఖండ్‌తో కలిపి).2001 గణాంకాల ప్రకారం... దేశం మొత్తం జనాభాలో ఇవి 41 శాతం కల్గి ఉన్నాయి. ఈ నాలుగు రాష్ట్రాల్లో... మధ్యప్రదేశ్ (ఛత్తీస్‌గఢ్ కలిపి)లో మాత్రమే 1991-2001 మధ్య సగటు సాంవత్సరిక జనాభా వృద్ధి తగ్గింది. ఈ కాలంలో బీహార్ (జార్ఖండ్ కలిపి)లో జనాభా పెరగగా... రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ (ఉత్తరాఖండ్‌తో కలిపి)లో జనాభా పెరుగుదలలో మార్పులేదు.

పర్యావరణానికి సవాలుగా:

గత 60 ఏళ్లుగా జనాభా పెరుగుదల.. ఆర్థిక వృద్ధి, ప్రజల జీవన నాణ్యతపై ప్రభావం చూపింది. ఇది సాంఘిక, ఆర్థిక, పర్యావరణ సుస్థిరతకు సవాలుగా మారింది. 1950-51 నుంచి 2005-06 మధ్యకాలంలో.. దేశ స్థూల జాతీయోత్పత్తి స్థిర ధరల వద్ద (1999-2000) 12 రెట్లు పెరిగింది. 1950-51లో స్థూల జాతీయోత్పత్తి రూ.2179 బిలియన్లు. కాగా 2005-06లో రూ. 25,807 బిలియన్లకు పెరిగింది. అయితే, తలసరి స్థూల జాతీయోత్పత్తిలో పెరుగుదల 3.57 రెట్లు మాత్రమే పెరగడం... జనాభా వృద్ధిరేటు ఎక్కువగా ఉండడాన్ని సూచిస్తుంది.

1950-51లో తలసరి స్థూల జాతీయోత్పత్తి రూ. 5,799. కాగా 2005-06లో రూ. 20,734. స్థూల జాతీయోత్పత్తి(GNP)లో ఎక్కువ భాగాన్ని పెరుగుతున్న జనాభాకు అవసరమైన కనీస సౌకర్యాలపై వ్యయం చేయడం వల్ల... ప్రజల జీవన నాణ్యత ఆశించినంతగా మెరుగుపడలేదు. జనాభా పెరుగుదల ప్రభావం పర్యావరణ సుస్థిరతపై కూడా కనిపించింది. 1990 నుంచి 2002 మధ్యకాలంలో.. మొత్తం శక్తి వినియోగం.. 366 మిలియన్ టన్నుల నుంచి 538 మిలియన్ టన్నులకు పెరిగింది. ఇదేకాలంలో వాతావరణంలోకి కార్బన్ డయాక్సైడ్ విడుదల 680 మిలియన్ టన్నుల నుంచి 1118 మిలియన్ టన్నులకు పెరిగింది. 1990 నుంచి దేశంలో శక్తి తలసరి వినియోగం పెరగడానికి అధిక జనాభానే కారణం. అధిక జనాభా... ఇంధన వినియోగంలో 56 శాతం కంటే ఎక్కువ పెరుగుదలకు... కార్బన్‌డయాక్సైడ్ విడుదల 36 శాతం మేర పెరగడానికి దారితీసింది. ఇది పర్యావరణంపై ఒత్తిడి పెంచింది.

జనాభా-ఆర్థికాభివృద్ధి:

దేశంలో లభ్యమయ్యే భౌతిక వనరులను శ్రామికశక్తి సహాయంతో వినియోగించుకోవడం వల్ల ఉత్పాదక ప్రక్రియ వేగవంతమవుతుంది. తద్వారా దేశంలో ఆర్థికాభివృద్ధి చోటుచేసుకుంటుంది. ఈ అభివృద్ధి ప్రయత్నంలో... శ్రామికశక్తి నుంచి ధనాత్మక వాటా లభించినప్పటికీ.. వేగంగా పెరుగుతున్న జనాభా... అభివృద్ధి ప్రక్రియను ఆటంకపరుస్తుంది. జనాభా వృద్ధి.. ఆర్థిక, సామాజిక, ప్రజల జీవన నాణ్యత మెరుగుదలకు అవసరమైన వనరుల లభ్యతపై ప్రతికూల ప్రభావాన్ని చూపింది. అదేవిధంగా అధిక జనాభావృద్ధి... తలసరి ఇంధన వినియోగం పెరుగుదలకు దారితీసి, పర్యావరణ క్షీణతకు కారణమైంది. జనాభా పెరుగుదలను అరికట్టపోతే.. కాలుష్య సమస్యలు, తద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తి.. ఆర్థిక ప్రగతిలో అసమానతలకు, నిరుద్యోగం, పేదరికం పెరగడానికి దోహదపడతాయి.

మాల్థస్ (Malthus)... An Essay on the principles of population అనే గ్రంథంలో... జనాభా పెరుగుదల, ఆహార

సరఫరాకు ఉన్న విలోమ సంబంధాన్ని వివరించారు. జనాభా అధిక వృద్ధి వల్ల తలసరి సాగుభూమి తగ్గుతుంది. 1921 నుంచి 2001 మధ్యకాలంలో తలసరి సాగుభూమి 1.11 ఎకరాల నుంచి 0.32 ఎకరాలకు తగ్గింది. 1961లో దేశ జనాబా 442 మిలియన్లు. కాగా ఆహార ధాన్యాల నికరలభ్యత 76 మిలియన్ల టన్నులు. అయితే తలసరి ఆహార ధాన్యాల లభ్యత 469 గ్రాములు. 2005లో జనాభా 1103 మిలియన్లు. కాగా మొత్తం ఆహార ధాన్యాల నికర లభ్యత 157 మిలియన్ టన్నులకు పెరిగింది. అయినా తలసరి ఆహార ధాన్యాల లభ్యత 422 గ్రాములకు తగ్గడం.. జనాబా అధిక వృద్ధిని తెలియ చేస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో జనాభావృద్ధి అధికమైనందువల్ల మొత్తం ఆహార ఉత్పత్తిలో కుటుంబ వినియోగం వాటా తగ్గి, మిగులు తగ్గ తుంది. జనాభా వృద్ధి శ్రామికశక్తిలో పెరుగుదలకు దారితీసి... నిరుద్యోగం పెరగడానికి కారణమవుతోంది. గత 56 ఏళ్ల ప్రణాళికా కాలంలో... శ్రామిక శక్తిలో నికర పెరుగుదల కారణంగా తలెత్తిన నిరపేక్ష, సాపేక్ష నిరుద్యోగం పెరుగుదలను నియంత్రించడంలో విధాన నిర్ణేతలు విఫలమయ్యారు. రాబోయే రోజుల్లో ఈ స్థితి మరింత సమస్యకు దారితీస్తుంది. పెరుగుతున్న శ్రామికశక్తికి అనుగు ణంగా ఉపాధిని కల్పించాలంటే... జాతీయ వనరుల్లో ఎక్కువ భాగా న్ని ఇందుకోసం కేటాయించాలి. 11వ ప్రణాళిక పత్రం ప్రకారం... నిరుద్యోగితా రేటు 2004-05లో 8.3 శాతానికి పెరిగింది.

జనాభా విధానాలు:

స్వాతంత్ర్యానంతరం ప్రభుత్వం రూపొందించిన జనాభా విధా నాలు... దేశంలో అధిక జనాభావృద్ధి నియంత్రణకు అవసరమైన అన్ని చర్యలు సూచించాయి. 1952 తర్వాత దేశ జనాభా విధా నంలో... జనాభా సహజవృద్ధి తగ్గించడానికి fertility, మరణరేటు తగ్గించడానికి కుటుంబ నియంత్రణకు ప్రోత్సాహమిచ్చారు. దీని ఫలితంగా దేశవ్యాప్తంగా fertility, మరణరేట్లు తగ్గాయి. దేశంలో ప్రస్తుతం 15 సంవత్సరాల లోపు వారు 35 శాతం మంది ఉన్నారు.

జనాభా విధానం ప్రభావం.. జననరేటు లక్ష్యాల సాధన ఆధా రంగా తెలుసుకోవచ్చు. మొదటి పంచవర్ష ప్రణాళికలో... ప్రతి 1000 జనాభాకు జనన రేటు 25గా ఉండాలని... ఈ లక్ష్యాన్ని 1972 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా... ఈ లక్ష్యం 30 ఏళ్ల తర్వాత సాధ్య మైంది.

అదేవిధంగా 2000 జాతీయ జనాభా విధానం... replacement fertility 2010 నాటికి సాధించాలని లక్ష్యంగా పెట్టుకోగా... 2021లోపు ఈ లక్ష్యాన్ని చేరుకునే పరిస్థితి కనిపించడంలేదు. రాష్ట్రాల వారీగా పరిశీలించినపుడు.. ఉత్తరప్రదేశ్(ఛత్తీస్‌గఢ్‌తో కలిపి)లో ఈ లక్ష్యం 2025 తర్వాతే సాధించే అవకాశం కన్పిస్తుంది.

ఇద్దరు పిల్లల నిబంధన పాటించాలని... 2046 నాటికి జనాభా స్థిరీకరణ సాధించాలనే ఉద్దేశంతో...'జనాభా విధానం-2000'ను ప్రభుత్వం ప్రకటించింది. ప్రతి వేయి జననాలకు.. శిశు మరణాలు 30కి తగ్గించాలని .. ప్రసూతి మరణాలు ప్రతి లక్ష ప్రసవాలకు 100 లోపు ఉండాలని .. universal immunisation సాధించాలని, 80 శాతం ప్రసవాలు శిక్షణ పొందిన స్టాఫ్ ఉన్న డిస్పెన్సరీలు, ఆసుపత్రుల్లో జరగాలని, communicable వ్యాధులను నియంత్రించాలనే లక్ష్యాలను ఈ విధానంలో పొందుపరిచారు. ఈ లక్ష్యాల సాధనకు సంబంధించి దేశ ప్రగతి అంత సంతృప్తికరంగా లేదు.

జాతీయ జనాభా విధాన లక్ష్యాలకు సంబంధించి రాష్ట్రాల ప్రగతిని కొలవడానికి 8 సూచికలను రూపొందించారు. వీటిలో నాలుగు ప్రభావిత సూచికలు (Impact indicators). మిగిలిన నాలుగు programme indicators. ప్రభావిత సూచికలుగా... మొత్తం సంతాన సాఫల్య రేటు, శిశుమరణాల రేటు, ప్రసూతి మరణాల రేటు, 18 సంవత్సరాలలోపు వివాహమైన స్త్రీల నిష్పత్తి తీసుకోగా... ప్రోగ్రామ్ సూచికలుగా... contraceptionకు ఉన్న డిమాండ్, Immunised children నిష్పత్తి, సురక్షిత డెలివరీల నిష్పత్తి, జననా(రిజిస్ట్రెషన్)ల నమోదు పూర్తి వంటి అంశాలను తీసుకొన్నారు!!

ఆర్థిక ద్వంద్వత్వం

ఆర్థిక ద్వంద్వత్వం

అభివృద్ధి చెందిన, వెనుకబడిన లక్షణాలు ఆర్థిక వ్యవస్థలో ఒకేసారి కనిపిస్తుంది. ఆధునిక రంగం, సంప్రదాయ రంగం పక్కపక్కనే సహజీవనం చేస్తాయి. **ఉదా:** అధునాతన వస్త్ర పరిశ్రమ ఒకవైపు, పురాతన చేనేత పరిశ్రమ మరోవైపు మన దేశంలో కనిపిస్తాయి.

సామూహిక పేదరికం

కనీస జీవితావసరాలు కూడా తీర్చుకోలేని పరిస్థితిని నిరపేక్ష పేదరికం అంటారు. మన దేశంలో నిరపేక్ష పేదరికం ఎక్కువ. NSSO 61వ రౌండ్ (2004-05) అంచనాల మేరకు మన దేశంలో పేదరికం యూఆర్పీ (యూనిఫాం రీకాల్ పీరియడ్) ప్రకారం 27.5%. ఎంఆర్పీ (మిక్స్డ్ రీకాల్ పీరియడ్) ప్రకారం 21.8%గా ఉంది.

యూఆర్పీలో అన్నీ రకాల వస్తువులకు 30 రోజుల వ్యయం ఆధారంగా దత్తాంశాన్ని, ఎంఆర్పీలో 5 రకాల ఆహారేతర వస్తువులు.. వస్త్రాలు, పాదరక్షకులు, విద్య, వైద్యం మన్నిక గల వస్తువులు 365 రోజులకు అయ్యే వ్యయాన్ని, మిగిలిన వస్తువులకు 30 రోజులకు అయ్యే వ్యయం ఆధారంగా దత్తాంశాన్ని సేకరిస్తారు.

భారత ఆర్థిక వ్యవస్థలో జాతీయ తలసరి ఆదాయం పెరిగింది. అంటే పరిమాణాత్మక మార్పులు సంభవించాయి. జాతీయాదాయంలో ప్రాథమిక రంగ వాటా తగ్గుతూ, ద్వితీయ, తృతీయ రంగాల వాటా పెరుగుతోంది. వృత్తుల విభజనలో మార్పులొచ్చాయి. అవస్థాపన సదుపాయాలు అభివృద్ధి చెందాయి. బ్యాంకింగ్, విత్తసంస్థలు విస్తరించాయి. అంటే నిర్మాణాత్మక మార్పులు సంభవించాయి. ప్రణాళికలు ప్రారంభించిన మొదటి దశాబ్దాల్లో 3.5% వృద్ధిరేటు సాధిస్తే తర్వాత 5.6% వృద్ధి, 2000 తర్వాత 7% జీడీపీ వృద్ధిరేటు నమోదైంది. పేదరికం 1973-74లో 55% ఉంటే, 2004-05 నాటికి యూఆర్పీ ప్రకారం 28%కి తగ్గింది. అక్షరాస్యత 1951లో 18% నుంచి 2001 నాటికి 65.38%కి పెరిగింది. ప్రజల ఆయుర్దాయం 1951లో 32 ఏళ్లు ఉంటే 2003 నాటికి 63.3 ఏళ్లకు పెరిగింది. 1960-61లో జీడీపీలో 10% ఉన్న మూలధన కల్పన రేటు, 2004-05 నాటికి 30% పైగా పెరిగింది. ఈ అంశాలన్నీ భారతదేశం అభివృద్ధి చెందుతున్న దేశంగా పేర్కొనడానికి సాక్ష్యాలుగా ఉన్నాయి.

అయినా పేదరికం, నిరుద్యోగిత, అసమానతలు అధిక స్థాయిలో ఉండటం, అల్ప మానవాభివృద్ధి, 35% నిరక్షరాస్యత, 64% ప్రజలకు సురక్షిత మంచినీరు లేకపోవడం, 2008 మానవాభివృద్ధిలో 132వ ర్యాంక్‌ను సాధించటం మన దేశ అల్పాభివృద్ధిని సూచిస్తున్నాయి.

యూఆర్పీ	ఎంఆర్పీ ప్రకారం పేదరికం అంచనాలు 61వ రౌండ్ 2004-05	ప్రకారం పేదరికం అంచనాలు 61వ రౌండ్ 2004-05
గ్రామీణ ప్రాంతం	28.3	21.8
పట్టణ ప్రాంతం	25.7	21.7
దేశం మొత్తం	27.5	21.8

MODEL QUESTIONS

1. దేశాల అధిక, మధ్య, తక్కువ ఆదాయ ఆర్థిక వ్యవస్థల వర్గీకరణ దేని ఆధారంగా చేస్తారు?

ఎ) జనాభా బి) జీఎన్పీ

సి) విస్తీర్ణం డి) తలసరి జీఎన్పీ

2. యూఎన్డీపీ ప్రచురించిన 2008 మానవాభివృద్ధి నివేదికలో మానవాభివృద్ధి సూచీ (హెచ్డీఐ)లో భారత్ స్థానం?

ఎ) 126 బి) 128 సి) 125 డి) 132

3. 2001 జనాభా లెక్కల ప్రకారం ఎంత శాతం కుటుంబాలు సురక్షిత మంచి నీటిని పొందుతున్నాయి?

ఎ) 60% బి) 36% సి) 52% డి) 34.5

4. డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటే?

ఎ) జనాభాలో 0.14 సంవత్సరాల మధ్య గల పిల్లల శాతం పెరుగుదల

బి) జనాభాలో 15.64 సంవత్సరాల మధ్య గల ఉత్పాదక జనాభా పెరుగుదల

సి) 65 సంవత్సరాల పైన గల వయోవృద్ధి జనాభా పెరుగుదల

డి) ఏదీ కాదు

5. 1951 నాటి భారత అక్షరాస్యత ఎంత?

ఎ) 32% బి) 18%

సి) 54% డి) 65.38%

6. 2004-05 నాటికి NSSO అంచనాల మేరకు యూఆర్పీ ప్రకారం భారత పేదరికం శాతం ఎంత?

ఎ) 21.8 బి) 27.5

సి) 20.3 డి) 25.7

సమాధానాలు : 1 - డి 2 - డి 3 - బి 4 - బి 5 - బి 6 - బి

ఆర్థికాభివృద్ధిలో మానవవనరుల పాత్ర



ఒక దేశ ఆర్థికాభివృద్ధిలో సహజవనరులు, మూలధనం తో పాటు మానవాభివృద్ధి కూడా ప్రధానపాత్ర పోషి స్తుంది. తృతీయ ప్రపంచ దేశాల వెనుకబాటుకు ఆయా దేశాలలో మానవాభివృద్ధి తక్కువగా ఉండటమే కారణ మని ఆర్థికవేత్తల అభిప్రాయం.

విద్య, ఆరోగ్యం, శిక్షణ మానవాభివృద్ధిలో కీలక పాత్ర వహిస్తాయి. మానవాభివృద్ధి సాధించాలంటే..ఆర్థిక, సామాజిక రంగాలలో ప్రగతి అందుకు మార్గాలుగా ఉపకరిస్తాయి. ఉపాధి అవకాశాలను పెంచడం ద్వారా పేదరికాన్ని, నిరుద్యోగాన్ని నిర్మూలించాలంటే.. ఆర్థికాభివృద్ధి గణనీయంగా ఉండాలి. ప్రజల జీవనప్రమాణ మెరుగుదలకు సామా జికాభివృద్ధి కీలకం. ఆఫ్రికా దేశాలలో సహజ వనరులు ఉన్నా.. వాటిని సరిగా వినియోగించుకోగలిగే సామర్థ్యం మానవ వనరులకు లేకపోవడంతో ఇప్పటికీ అవి అల్పాదాయ దేశాలుగానే మిగిలిపో యాయి.

ప్రపంచ అభివృద్ధి నివేదిక:

ప్రపంచ అభివృద్ధి నివేదిక-2008 ప్రకారం... 2005లో తలసరి ఆదాయం 905 డాలర్లు, అంతకన్నా తక్కువగా ఉన్న దేశాలను అల్పాదాయ దేశాలు; 906 డాలర్ల నుంచి 11,115 డాలర్ల వరకూ తలసరి ఆదాయం ఉన్న దేశాలను మధ్య ఆదాయ దేశాలు; 11,116 డాలర్ల కన్నా ఎక్కువ తలసరి ఆదాయం ఉన్న దేశాలను అధిక ఆదాయ దేశాలు. భారత్‌లో తలసరి ఆదాయం 820 డాలర్లుగాను, చైనాలో 2010 డాలర్లుగాను, పాకిస్థాన్‌లో తలసరి ఆదాయం 770 డాలర్లుగా ఉందని ఈ నివేదిక పేర్కొంది. భారత్, పాకిస్థాన్‌లను అల్పాదాయ దేశాలుగా.. చైనాను మధ్య ఆదాయ దేశంగా (Middle Income Country)పరిగణి స్తున్నారు.

యూఎన్‌డీపీ... సూచీలు:

ఐక్యరాజ్యసమితికి చెందిన UNDP మానవాభివృద్ధి నివేదికను 1990 నుంచి ప్రచురిస్తోంది. తర్వాతి కాలంలో ఇతర సూచీలు అభివృద్ధి చేశారు. లింగ సంబంధిత అభివృద్ధి సూచీ(GDI)ని 1995లో, లింగసాధికారత కొలమానం(GEM)ను 1995లో రూపొందించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు మానవ పేదరిక సూచీ-1 (HPI 1) ను 1997లోను, అభివృద్ధి చెందిన
దేశాలకు (HPIPI2 (మానవ పేదరిక సూచీ-2) 1998లో రూపొందించారు. సాంకేతిక సాధనా సూచీ (TAI)న ని 2001లో రూపొందించారు.

మానవాభివృద్ధి సూచీ (HDI):

UNDP మానవాభివృద్ధి సూచీని 177 దేశాలకు రూపొందిం చింది. ఈ సూచీకి సంబంధించి ఐస్‌లాండ్ ప్రథమస్థానాన్ని, నార్వే ద్వితీయ స్థానాన్ని, ఆస్ట్రేలియా తృతీయ స్థానాన్ని, చైనా 81వ స్థానాన్ని, భారతదేశం 128వ స్థానాన్ని, పాకిస్థాన్ 136వ స్థానాన్ని, నైజర్ 174వ స్థానాన్ని, సియారాలియాన్ (Sierra Leone) చి చిట్టచివరి స్థానం 177ను పొందాయి. ఈ సూచీని తయారుచేయడానికి (1) దీర్ఘకాల ఆరోగ్యవంతమైన జీవనం లేదా ఆయుర్దాయం, (2) అక్షరాస్యత (వయోజన అక్షరాస్యతతో పాటు ప్రాథమిక, ద్వితీయ, తృతీయ విద్యలలో ఉమ్మడి నమోదు నిష్పత్తి), (3) కొనుగోలు శక్తిసామ్యం ఆధారంగా లెక్కించిన తలసరి ఆదాయం (PPP $) ను ప్రమాణికంగా తీసుకుంటారు. HDI విలువ ఐస్‌లాండ్‌కు 0.968

గాను, నార్వేకు 0.968, ఆస్ట్రేలియా కు 0.962, చైనా 0.777, ఇండియా 0.619, పాకిస్తాన్ 0.551, నైజర్ 0.374, సియారాలియాన్‌లో 0.336గా ఉంది.

మానవాభివృద్ధి నివేదిక-2007:

మానవాభివృద్ధి నివేదిక - 2007 ప్రకారం.. 2005లో సగటు జీవన ప్రమాణం భారత్‌లో 63.7 ఏళ్లు. ఐస్‌లాండ్‌లో 81.5, నార్వేలో 79.8, ఆస్ట్రేలియా 80.9, చైనాలో 72.5, పాకిస్తాన్‌లో 64.6, నైజర్‌లో 55.8 ఏళ్లుగా ఉంది. మానవాభివృద్ధి సూచీలో చివర స్థానాన్ని పొందిన సియారాలియాన్‌లో 41.8 సంవత్సరాలు. మనదేశంలో 1995 - 2005 మధ్యకాలంలో 15 ఏళ్లు దాటిన వయోజనుల అక్షరాస్యత 61 శాతం కాగా.. చైనాలో 90.9 శాతంగాను, పాకిస్తాన్‌లో 49.9 శాతం, నైజర్‌లో 28.7 శాతం, సియారాలియాన్‌లో 34.8 శాతంగా ఉంది. కొనుగోలు శక్తిసామర్థ్యం (PPP) ఆధారంగా.. 2005లో మనదేశంలో తలసరి ఆదాయం 3452 డాలర్లు. ఐస్‌లాండ్‌లో 36,510 డాలర్లు, నార్వేలో 41,420 డాలర్లు, చైనాలో 6757 డాలర్లు, పాకిస్తాన్‌లో 2370 డాలర్లు, నైజర్‌లో 781 డాలర్లు, సియారాలియాన్‌లో 806 డాలర్లు.

మానవాభివృద్ధి నివేదిక 70 దేశాలను అధిక మాన వాభివృద్ధి జరిగిన దేశాలుగా.. 85 దేశాలను మధ్య మానవాభివృద్ధి (Medium Human Development) చెందిన దేశాలుగా.. 22 దేశాలను అల్పమానవాభివృద్ధి చెందిన దేశాలుగా వర్గీకరించింది. అధిక మానవాభివృద్ధి జరిగిన దేశాల సగటు HDI విలువ 0.897, Medium Human Development దేశాల HDI సగటు విలువ 0.698గాను, అల్పమానవాభివృద్ధి దేశాల సగటు HDI విలువ 0.436గా పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న దేశాల HDI విలువ 0.691గాను, తక్కువ అభివృద్ధి చెందిన దేశాల HDI విలువ 0.488గా వెల్లడించింది. దీంతోపాటు అధిక ఆదాయదేశాల సగటు HDI విలువ 0.936 కాగా.. మధ్య ఆదాయ దేశాల ఏఈఐ విలువ 0.776, అల్పాదాయ దేశాల HDI విలువ 0.570. ప్రపంచ మానవాభివృద్ధి సూచీ విలువను 0.743గా పేర్కొంది. జీవన ప్రమాణాల్లో ప్రపంచ సగటు 68.1 ఏళ్లుగా, వయోజన అక్షరాస్యతలో ప్రపంచసగటు 78.6 శాతంగాను, ఉమ్మడి స్థూలనమోదు నిష్పత్తి ప్రపంచ సగటు 67.8 శాతంగాను ఉన్నట్లు తెలిపింది.

మానవ పేదరిక సూచీ (HPI):

UNDP మానవ పేదరిక సూచీని రూపొందించి, 1997లో మానవాబివృద్ధి నివేదికలో ప్రచురించింది. పేదరికం కొలమానంలో... ఒక నిర్ణీత ఆదాయం కంటే తక్కువ ఆదాయం పొందే పేదవారి సంఖ్యను.. హెడ్‌కౌంట్ రేషియో ద్వారా లెక్కి స్తున్నారు. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాలమధ్య మానవాభివృద్ధిలో వ్యత్యాసాలు ఎక్కువగా ఉన్నాయి. అందువల్ల ఆయా దేశాలకు సంబంధించి సూచీని వేర్వేరుగా నిర్మిస్తారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు రూపొందించిన సూచీని HPI1 గాను, అభివృద్ధి చెందిన దేశాలకు నిర్మించిన సూచీని HPI2 గాను పిలుస్తారు. HPI1 తయారుచేయడానికి సూచికలుగా...(1) 40 సంవత్సరాలులోపు జీవించడానికి సంభావ్యత (2) వయోజన నిరక్షరాస్యత రేటు (3) జీవన ప్రమాణం అంశానికి సంబంధించి సురక్షితమైన నీరు ఉపయోగించని ప్రజల శాతం , సరైన బరువు లేకుండా 5 ఏళ్ల లోపు ఉన్నవారి శాతం పరిగణనలోకి తీసుకుంటారు. ఈ నివేదిక (2007) 108 దేశాలకు HPI1ను తయారుచేసింది. ఈ సూచీకి సంబంధించి బార్బడాస్ మొదటిస్థానాన్ని , చాద్ 108వ స్థానాన్ని పొందాయి. చైనా 29వ స్థానాన్ని, ఇండియా 62, నైజర్ 104, పాకిస్థాన్ 77, చాద్ 108వ స్థానాన్ని పొందాయి. మానవ పేదరిక సూచీ విలువ భారత్‌కు 31.3 కాగా.. చైనా 11.7, పాకిస్తాన్ 36.2, నైజర్ 54.7గా ఉంది.

ఈ నివేదిక ప్రకారం.. 40ఏళ్ల లోపు జీవించడానికి గల సంభావ్యత మనదేశంలో 2000-05 మధ్యకాలంలో.. 16.8 శాతం, చైనాలో 6.8 శాతం, పాకిస్తాన్‌లో 15.4 శాతం, నైజర్‌లో 28.7 శాతం, సియారాలియాన్‌లో 45.6 శాతం; సురక్షితమైన నీరు లభించని ప్రజలు భారత్‌లో 14శాతం కాగా, చైనాలో 23 శాతం, పాకిస్తాన్‌లో 9 శాతం, నైజర్‌లో 54 శాతం, సియారాలియాన్‌లో 43 శాతం మంది ఉన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన నివసించే జనాభా (జాతీయసగటు) మనదేశంలో 28.6 శాతం కాగా.. చైనాలో 4.6 శాతం, పాకిస్తాన్‌లో 32.6 శాతం, నైజర్‌లో 63 శాతం, సియారాలియాన్‌లో 70.2 శాతం మంది.

లింగసంబంధిత అభివృద్ధి సూచీ (GDI) :

UNDPD సూచీని 1995 మానవాభివృద్ధి నివేదికలో ప్రవేశపెట్టింది. ఇందుకోసం(1)మహిళ జీవన ప్రమాణం, (2) మహిళల్లో వయోజనుల అక్షరాస్యత, స్థూల నమోదు నిష్పత్తి, (3) మహిళల తలసరి ఆదాయం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. లింగసంబంధిత అసమానతలు లేనప్పుడు GDI విలువ, HDI విలువ సమానంగా ఉంటాయి. అసమానతలు ఉన్నప్పుడు GDI విలువ GDI విలువకన్నా తక్కువగా ఉంటుంది. ఈ రెండు సూచీల మధ్య తేడా ఎక్కువయినపుడు లింగసంబంధిత అసమానతలు ఎక్కువగా ఉన్నాయని అర్థం. ఈ నివేదిక (2007) ప్రకారం ..సూచీలో ఐస్‌లాండ్ ప్రథమస్థానాన్ని, ఆస్ట్రేలియా 2వ స్థానాన్ని, నార్వే 3వ స్థానాన్ని, చైనా 73వ స్థానాన్ని, భారత్ 113వ స్థానాన్ని, పాకిస్తాన్ 125వ స్థానాన్ని, సియారాలియాన్ 157వ స్థానాన్ని పొందాయి.

1. 1991 జనాభా లెక్కలతో పోలిస్తే, 2001లో భారతదేశ లింగ నిష్పత్తి?

(నాన్ గెజిటెడ్- 2005)

ఎ) మార్పు లేకుండా స్థిరంగా ఉంది
బి) స్వల్పంగా మెరుగైంది
సి) ఉపాంతంగా తగ్గింది
డి) బాగా మెరుగైంది

సమాధానం: బి

వివరణ: ప్రతి 1000 పురుషులకు గల స్త్రీల నిష్పత్తిని లింగ నిష్పత్తి (Sex Ratio) అంటారు. 1901లో 972 మంది స్త్రీలు ఉండేవారు. ఇది 1991 నాటికి 927కు తగ్గింది. అయితే 2001 నాటికి స్త్రీల జనాభా స్వల్పంగా పెరిగి 933కు చేరింది. స్త్రీ, శిశు సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడమే దీనికి కారణం.

2. జనాభా విషయంలో చైనా, భారత్‌లు అతిపెద్ద దేశాలయితే వీటి తరువాత మూడో స్థానం గల దేశం? (ఏపీపీఎస్సీ 2008)

ఎ) బ్రెజిల్
బి) రష్యా
సి) అమెరికా
డి) ఇండోనేషియా

సమాధానం: సి

వివరణ: చైనా, భారతదేశం తర్వాత అత్యధిక జనాభా కలిగిన 3వ దేశం అమెరికా. ప్రపంచ జనాభాలో దాని శాతం 4.6 మాత్రమే. అంటే భారత జనాభాలో సుమారు 1/4వ వంతు కలిగి ఉంది. అమెరికా తర్వాత స్థానాలను ఇండోనేషియా, బ్రెజిల్, రష్యాలు పొందాయి. ఈ నాలుగు దేశాల జనాభాను కలిపినప్పటికీ భారత జనాభా కంటే తక్కువే.

3. 2001 జనాభా గణనల అంచనా ప్రకారం ఎక్కువ జనాభా వృద్ధి రేటున్న రాష్ట్ర?

(ఎన్డోమెంట్ ఈఓ- 2008)

ఎ) మధ్యప్రదేశ్
బి) మణిపూర్
సి) రాజస్థాన్
డి) నాగాలాండ్

సమాధానం: డి

వివరణ: 2001 జనాభా లెక్కల ప్రకారం అత్యల్ప జనాభా వృద్ధిరేటుతో కేరళ (9.43 శాతం) అభివృద్ధి చెందిన ఐరోపా, అమెరికా దేశాలతో సరిపోల్చదగిన విధంగా ఉంది. అత్యధిక జనాభా వృద్ధిరేటు 64.53 శాతంతో నాగాలాండ్ మొదటి స్థానంలో ఉంది. ప్రతి పదేళ్లలో పెరిగే జనాభా వృద్ధిరేటును తెలిపేదే దశాబ్ద జనాభా వృద్ధిరేటు. సగటున ఏడాదికి పెరిగే జనాభా వృద్ధిని తెలిపేది వార్షిక జనాభా వృద్ధిరేటు. ఈ రెండూ నాగాలాండ్‌లో అధికంగా ఉన్నాయి.

4. స్థూల మరణాల రేటు అంటే (Crude Death Rate)?

(గ్రూప్-2, 2005)

ఎ) ప్రతి వేయి మంది స్త్రీలలో సగటు మరణాల సంఖ్య
బి) ప్రతి వేయి మంది గర్భాన్ని ధరించే శక్తి గల స్త్రీలలో సగటు మరణాల సంఖ్య
సి) ప్రతి వేయి మందికి సగటు మరణాల సంఖ్య
డి) ప్రతి వేయి మంది పురుషులకు సగటు మరణాల సంఖ్య

సమాధానం: సి

వివరణ: స్థూల మరణరేటును ప్రతి వేయి మందికి గణిస్తారు. మరణాలు స్త్రీ, పురుషులకు సంబంధించింది కాబట్టి ఇద్దరినీ కలిపి గణిస్తారు. సంతానోత్పత్తి రేటు (TFR)ను మాత్రం ప్రత్యేకంగా పునరుత్పత్తి వయసులో గల స్త్రీకి గణిస్తారు.

5. 2008-2009 ఆర్థిక సర్వే ప్రకారం 2007 నాటికి భారత శిశు మరణ రేటు?

ఎ) 58
బి) 115
సి) 57
డి) 55

సమాధానం: డి

వివరణ: ప్రతి వేయి సజీవ జననాల్లో మొదటి పుట్టినరోజు కూడా చూడకుండానే అంటే పుట్టిన ఏడాది లోపు చనిపోయే శిశువుల సంఖ్యను శిశుమరణ రేటు అంటారు. ఆర్థిక సర్వే 2008-09 ప్రకారం 2007 నాటికి భారత శిశుమరణ రేటు 55. మన రాష్ట్రంలో జాతీయ స్థాయి కంటే ఒకటి తక్కువగా (54) ఉంది. 1961 నాటికి ఇది 115గా ఉంది. 2007 నాటికి అత్యల్ప శిశుమరణ రేటు గల రాష్ట్రం మణిపూర్ (12), అత్యధిక శిశుమరణ రేటు గల రాష్ట్రం మధ్యప్రదేశ్ (72).

6. 2001 జనాభా లెక్కల ప్రకారం భారతదేశ జనాభాలో మొత్తం పనిచేసే శ్రామికుల శాతం? (గ్రూప్-1 ప్రిలిమ్స్-2007)

ఎ) 37.5
బి) 39.
సి) 42.3
డి) 45.1

సమాధానం: బి

మొత్తం జనాభాలో పనిచేసే వారి శాతాన్ని తెలిపేదే పనిచేసే శ్రామిక శాతం (వర్క్‌ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్-డబ్ల్యూపీఆర్)

పనిచేసే శ్రామిక భాగస్వామ్య రేటు

$$= \frac{\text{మొత్తం పనివారు}}{\text{మొత్తం జనాభా}} \times 100$$

వివరణ: ఇది మన దేశంలో 1981లో 36.7, 1991 లో 37.7, 2001 నాటికి 39.2 శాతానికి పెరిగింది. ఈ WPR పురుషుల్లో 51.7 శాతం కాగా స్త్రీలలో 25.6 శాతం మాత్రమే ఉంది. అత్యధిక WPR కలిగిన

సంవత్సరం	గ్రామీణ జనాభా శాతం	పట్టణ జనాభా శాతం	పట్టణ జనాభా పెరుదల రేటు	పట్టణాల సంఖ్య
1901	89	11	-	1827
1951	82.7	17.3	43.2%	2843
1991	74.3	25.7	35.6%	4689
2001	72.2	27.8	31.2%	5161

రాష్ట్రం మిజోరాం, అత్యల్ప WPR కలిగిన రాష్ట్రం కేరళ. ఆంధ్రప్రదేశ్ 45.8 శాతం WPRతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కలిపి చూసినపుడు ఏడో స్థానంలో ఉంది.

7. అత్యధిక జనాభా గల నగరాలను అవరోహణ క్రమంలో (ఎక్కువ నుంచి తక్కువకు) అమర్చితే వరుసగా?

1) కోల్‌కతా 2) గ్రేటర్ ముంబయి
3) చెన్నై 4) ఢిల్లీ
5) హైదరాబాద్ 6) బెంగళూరు

ఎ) 2, 1, 3, 4, 6, 5 బి) 2, 1, 4, 3, 6, 5
సి) 2, 1, 4, 3, 5, 6 డి) 2, 1, 4, 5, 3, 6

సమాధానం: బి

2001 జనాభా లెక్కల్లో 10 లక్షలు జనాభా దాటిన నగరాలు మొత్తం 35 ఉన్నాయి. వీటిలో 50 లక్షలు జనాభా దాటిన మెగాసిటీలు 6 మాత్రమే. వాటిలో గ్రేటర్ ముంబయి, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లు జనాభా ప్రకారం 1 నుంచి 6వ ర్యాంకుల్లో ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 10 లక్షల జనాభా దాటిన నగరాలు 3 ఉన్నప్పటికీ, వాటిలో హైదరాబాద్ మాత్రమే మెగాసిటీగా ఆవిర్భవించింది. 1901లో దేశంలో ఒక్క నగరమే 10 లక్షలు జనాభా దాటిన (మెట్రోపాలిటన్ నగరం) నగరంగా ఉండేది. 1951 నాటికి అవి 5కు, 1991 నాటికి 23కు, 2001 నాటికి 35కు పెరిగాయి. మొత్తం పట్టణ జనాభాలో 38 శాతం ఈ 35 నగరాల్లోనే ఉంది.

8. 2001 జనాభా లెక్కల ప్రకారం హిందువుల తర్వాత అత్యధిక శాతం గల మతమేది?

ఎ) ముస్లింలు బి) క్రైస్తవులు
సి) సిక్కులు డి) బౌద్ధులు

సమాధానం: ఎ

వివరణ: 2001 లెక్కలప్రకారం హిందువులు (80.5 శాతం) తర్వాత అధిక శాతం ప్రజలు ముస్లిం మతంలో(13.4శాతం) ఉన్నారు. తర్వాత స్థానాల్లో క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు ఉన్నారు. ముస్లింల జనాభా ఎక్కువ గల రాష్ట్రం ఉత్తరప్రదేశ్. కానీ రాష్ట్ర జనాభాలో ఎక్కువ శాతం ముస్లింలు గల రాష్ట్రం జమ్మూ కాశ్మీర్. హిందువుల శాతం ఎక్కువ గల రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్, క్రిస్టియన్ల శాతం ఎక్కువ గల రాష్ట్రం నాగాలాండ్, బౌద్ధుల శాతం ఎక్కువ సిక్కింలో, జైనుల శాతం ఎక్కువ మహారాష్ట్రలో, సిక్కుల శాతం ఎక్కువగా పంజాబ్‌లో ఉంది.

9. 2001 జనాభా లెక్కల ప్రకారం మొత్తం జనాభాలో పట్టణ జనాభా శాతమెంత? (సివిల్స్2007)

ఎ) 23.3 బి) 25.7 సి) 27.8 డి) 28.9

సమాధానం: సి

వివరణ: మొత్తం జనాభాలో పట్టణాల్లో నివసించే జనాభా శాతం 1901లో 10.84 శాతం కాగా, క్రమంగా పెరుగుతూ వచ్చి 2001 నాటికి 27.8 శాతానికి చేరింది.

అత్యధిక పట్టణ జనాభా గల రాష్ట్రం మహారాష్ట్ర, అత్యల్ప పట్టణ జనాభా గల రాష్ట్రం సిక్కిం. రాష్ట్ర జనాభాలో పట్టణాల్లో ఎక్కువ శాతం నివసించే రాష్ట్రం అంటే అత్యధిక పట్టణీకరణ గల రాష్ట్రం గోవా, అత్యల్ప పట్టణీకరణ గల రాష్ట్రం హిమాచల్‌ప్రదేశ్. పెద్ద రాష్ట్రాల్లో అత్యధిక పట్టణీకరణ గల రాష్ట్రం తమిళనాడు.

10.2001 జనాభా లెక్కల ప్రకారం దేశంలో ఎస్సీ, ఎస్టీల జనాభా శాతం?

ఎ) 16.2, 6.6 బి) 18.2, 6.6
సి) 18.2, 6.6 డి) 16.2, 8.2

సమాధానం: డి

వివరణ: 16.6 కోట్ల జనాభా కలిగిన షెడ్యూల్డ్ కులాలవారు దేశ జనాభాలో 16.2 శాతం ఉండగా, 8.4 కోట్ల జనాభా కలిగిన షెడ్యూల్డ్ తెగల వారు 8.2 శాతమున్నారు. ఎస్సీ జనాభా శాతం ఎక్కువగా కలిగిన రాష్ట్రం పంజాబ్ కాగా, ఎస్టీ జనాభా శాతం ఎక్కువగా ఉన్న రాష్ట్రం మిజోరాం.

1. కింది వాక్యాలకు సంబంధించి సరైంది?

(సివిల్స్ 2009 ప్రిలిమ్స్)

(1)1951 నుంచి 2001 జనాభా లెక్కల వరకు భారత జనసాంద్రత 3 రెట్ల కంటే ఎక్కువగా పెరిగింది.

(2)1951 నుంచి 2001 జనాభా లెక్కల వరకు మన దేశ జనాభా వార్షికవృద్ధి రేటు రెట్టింపు అయింది.

ఎ) 1 బి) 2 సి) 1, 2

డి) రెండూ కావు

సమాధానం: (డి)

వివరణ: ఒక చదరపు కిలోమీటర్‌లో నివసించే జనాభాను జనసాంద్రత అంటారు. మొత్తం జనాభాను, దేశ భౌగోళిక విస్తీర్ణంతో భాగిస్తే జనసాంద్రత వస్తుంది. దేశ భౌగోళిక విస్తీర్ణం స్థిరంగా ఉండి, జనాభా నిరంతరం పెరగడంతో దేశ జన సాంద్రత పెరుగుతూ వస్తోంది. 1951లో దేశ జన సాంద్రత 117 కాగా, 2001 నాటికి 324కి పెరిగింది. అంటే 3 రెట్లకు దగ్గరగా పెరిగింది. ప్రతి పదేళ్లకు జనాభా పెరుగుదలను లెక్కిస్తే దానిని దశాబ్ద వృద్ధి రేటు అని, ఏడాదికి లెక్కిస్తే వార్షిక వృద్ధిరేటు అని అంటారు. 1951లో జనాభా వార్షిక వృద్ధి రేటు 1.26% కాగా, 2001 నాటికి 1.93%గా నమోదైంది. అంటే వార్షిక వృద్ధి రేటు 1971 నాటికి గరిష్టంగా 2.24 నమోదై, 1981 నుంచి తగ్గుతూ వచ్చింది. కాబట్టి 1951 నాటి వార్షిక వృద్ధిరేటుకు 2001 వృద్ధిరేటు ఎక్కువే గాని, రెట్టింపు కాదు.

2. కింది వాక్యాలకు సంబంధించి సరైంది ఏది?

(2009 సివిల్స్ ప్రిలిమ్స్)

(1)జన్మించిన నెలలోపు మరణించిన శిశువుల సంఖ్యను తెలిపేదే శిశుమరణరేటు.

(2)శిశువు జన్మించిన ఏడాదిలోపు ప్రతి 100 సజీ వ జననాలకు మరణించిన వారి సంఖ్యను తెలిపేదే శిశుమరణరేటు

ఎ) 1 బి) 2

సి) 1, 2 డి) ఏదీ కాదు

సమాధానం: (డి)

వివరణ: ప్రతి 1000 జననాలలో మొదటి పుట్టిన రోజు కూడా చూడకుండానే మరణించే వారి సంఖ్యను తెలిపేదే శిశు మరణరేటు. అంటే ఏదాదిలోపు చనిపోయే వారినే పరిగణనలోనికి తీసుకుంటారు.

3. డిమోగ్రాఫిక్ డివిడెండ్ (Demographic dividend) అనేది ఏ వయోవర్గ జనాభా పెరుగుదలను సూచిస్తుంది?

(2009 సివిల్స్ ఎకనామిక్స్)

ఎ) 1 నుంచి 14 ఏళ్ల మధ్య

బి) 15 నుంచి 64 ఏళ్ల మధ్య

సి) 65 నుంచి 74 ఏళ్ల

డి) 74 ఏళ్ల పైన

సమాధానం: (బి)

వివరణ: 15 ఏళ్లలోపు పిల్లల జనాభా పెరిగితే, ఆధారపడే వారి నిష్పత్తి కూడా పెరుగుతుంది. వీరు ఎటువంటి ఉత్పాదక కార్యక్రమాల్లోనూ పాల్గొనరు. కాబట్టి వీరిని అనుత్పాదక జనాభా అంటారు. ఈ వర్గం పెరగడంతో పని చేసే జనాభాపై భారం పెరిగి, వారి పొదుపుతో పాటు మూలధన కల్పన కూడా తగ్గుతుంది. అందువల్ల ఈ వర్గం పెరగడం మంచిది కాదు. 65 ఏళ్ల మించిన వృద్ధులు కూడా ఏ పనీ చేయలేరు. వీరు కూడా అనుత్పాదక జనాభాయే. 15 నుంచి 64 ఏళ్ల మధ్య గల వయో వర్గం వారు పెరగడంతో ఉత్పాదక జనాభా పెరిగి, వనరులను పూర్తి సామర్థ్యంతో ఉపయోగించుకునేందుకు వీలవుతుంది. ఫలితంగా ఆర్థికాభివృద్ధిని వేగం చేయొచ్చు. అందువల్ల 15 నుంచి 64 ఏళ్ల మధ్య జనాభా పెరుగుదలనే డెమోగ్రాఫిక్ డివిడెండ్ అంటారు.

4. ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో వరుసగా వచ్చే దశలు?

(సివిల్స్ 2003, ఎకనామిక్స్)

1 అధిక జనన, అల్ప మరణరేటు

2 అల్పజనన, అల్పమరణ రేటు

3 అధిక జనన, అధిక మరణరేటు

ఎ) 3, 2, 1 బి) 1, 3, 2

సి) 2, 3, 1 డి) 3, 1, 2

సమాధానం: (డి)

వివరణ: జనన, మరణ రేట్లకు ఆర్థికాభివృద్ధికి గల సంబంధాన్ని తెలిపేదే జనాభా పరిణామ సిద్ధాంతం. థామ్సన్, నోటెస్టీన్‌లు దీనిని మొదట ప్రతిపాదించారు. దీనిలో ముఖ్యంగా మూడు దశలు ఉన్నాయి.

మొదటి దశ: ఈ దశలో ఆర్థిక వ్యవస్థలు వ్యవసాయాధార ఆర్థిక వ్యవస్థలుగా ఉంటాయి. ప్రజల తలసరి ఆదాయం తక్కువగా ఉండడంతో జీవన ప్రమాణం కూడా అల్పంగానే ఉంటుంది. వైద్య సదుపాయాలు అభివృద్ధి చెంది ఉండవు. అంటు వ్యాధులకు నివారణ ఉండదు. రవాణా సదుపాయాల కొరత వల్ల కరువు కాటకాలు సంభవిస్తే ప్రాణనష్టం ఎక్కువగా ఉంటుంది. ఈ కారణాల వల్ల ఈ దశలో మరణరేటు ఎక్కువగా ఉంటుంది. నిరక్షరాస్యత, అజ్ఞానం, మూఢ నమ్మకాలకు ప్రాధాన్యమివ్వటం, శిశు మరణ రేటు ఎక్కువ గా ఉండటం, కుటుంబ నియంత్రణ సాధనాలపై అవగాహన లేకపోవడం వల్ల ఈ దశలో జననరేటు కూడా ఎక్కువగానే ఉంటుంది. అంటే ఈ దశలో అధిక జనన రేటు, అధిక మరణ రేటుతో జనాభా స్థిరంగా ఉంటుంది.

రెండో దశ: వ్యవసాయ ఆర్థిక వ్యవస్థ పారిశ్రామిక దిశగా పయనించడం వల్ల ప్రజల తలసరి ఆదాయం, జీవన ప్రమాణం పెరుగుతుంది. వైద్య, ఆరోగ్య సదుపాయాలు విస్తరిస్తాయి. మశూచీ, మలేరియా, కలరా, ప్లేగు లాంటి వ్యాధుల నివార ణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవటం వల్ల మరణరేటు వేగంగా తగ్గుతుంది. కానీ ఆర్థికవ్యవస్థలో వ్యవసాయ ఆధిక్యత, కొన్ని వర్గాలకే అక్షరాస్యత పరిమిత

మవడం, మూఢ నమ్మకాలపై విశ్వాసం కొనసాగటం, స్త్రీ నిరక్షరాస్యత వల్ల జనన రేటు మరణ రేటు తగ్గినంత వేగంగా తగ్గదు. ఫలితంగా అధిక జననరేటు, అల్పమ రణరేటు ఉంటుంది. అందువల్ల ఈ దశలో జనాభా విస్ఫోటనం సంభవిస్తుంది.

మూడో దశ: ఈ దశలో జననరేటు కూడా చెప్పుకోదగిన విధంగా తగ్గుతుంది. పట్టణీకరణ, పారిశ్రామికీకరణ సంభవించి, స్త్రీ అక్షరాస్యత పెరుగుతుంది. స్త్రీలు గృహకార్యకలాపాల నుంచి ఉత్పాదక కార్యకలాపాల్లో పాల్గొంటారు. ఉపాధిలో పాల్గొనడం వల్ల ఎక్కువ మంది పిల్లల సంరక్షణను స్త్రీలు భారంగా భావిస్తారు. వ్యవసాయ సమాజంలా కాకుండా, పారిశ్రామిక సమాజంలో ఉద్యోగ అవకాశాలు కూడా అవసరమైన మేరకే ఉంటాయి. మూఢ విశ్వాసాలు పోయి స్త్రీ, పురుష సమానత్వం పెరిగి పరిమిత కుటుంబాన్ని వాంఛిస్తారు. అందువల్ల జననరేటు కూడా వేగంగా తగ్గుతుంది. అంటే ఈ దశలో అల్ప మరణ రేటు, అల్పజననరేటు ఉండటంతో జనాభా వృద్ధి తక్కువగా ఉంటుంది.

అభివృద్ధి ప్రక్రియలో మొదటి అధిక జనన, మరణ రేట్లు, తరువాత అధిక జననరేటు, అల్ప మరణ రేటు, మూడో దశలో అల్ప జనన, మరణ రేట్లు సంభవిస్తాయి.

5. అతి తక్కువ లింగనిష్పత్తి (sex ratio) గల రాష్ట్రం? (2008 గ్రూప్ 2)

ఎ) కేరళ బి) తమిళనాడు

సి) ఆంధ్రప్రదేశ్ డి) హర్యానా

సమాధానం: (డి)

వివరణ: ప్రతి 1000 పురుషులకు గల స్త్రీల సంఖ్య ను స్త్రీ, పురుష నిష్పత్తి అంటారు. మన దేశంలో 1901లో స్త్రీ, పురుష నిష్పత్తి 972 కాగా 2001 నాటికి 933కి తగ్గింది. పేదరికం ఎక్కువగా ఉండటం, ఆడపిల్లలను భారంగా భావించడం, గర్భధారణ వయస్సులో స్త్రీలలో మరణాల రేటు ఎక్కువగా ఉండడంతో పాటు వివాహ సమయంలో కట్న కానుకలు లాంటి ఆచారాలు స్త్రీల నిష్పత్తి తగ్గడానికి కారణాలుగా నిలుస్తున్నాయి. మన దేశంలో దక్షణాధి కంటే ఉత్తరాధినే స్త్రీల నిష్పత్తి తక్కువగా ఉంది. అత్యధిక స్త్రీ, పురుష నిష్పత్తి రాష్ట్రాలు వరుసగా కేరళ (1058), చత్తీస్‌ఘడ్ (989), తమిళనాడు(987), ఆంధ్రప్రదేశ్ (978). అత్యల స్త్రీ, పురుష నిష్పత్తి రాష్ట్రాలు హర్యానా (861), సిక్కిం (875), పంజాబ్, జమ్మూకాశ్మీర్ మొదలైనవి.

6. 1991 - 2001లో ఆంధ్రప్రదేశ్ జనాభా చక్రవృద్ధి రేటు (Compound grown Rate of population)?

(గ్రూప్ -2, 2008)

ఎ) ఆంధ్రప్రదేశ్ రేటు > భారతదేశం

బి) ఆంధ్రప్రదేశ్ రేటు < భారతదేశం

సి) ఆంధ్రప్రదేశ్ = భారతదేశం

డి) భారత్ కంటే ఆంధ్రప్రదేశ్ జనాభావృద్ధి రేటు 50% అధికం.

సమాధానం: (బి)

వివరణ: ప్రతి పదేళ్లకు పెరిగే జనాభా వృద్ధిని దశాబ్ద వృద్ధి రేటు అంటారు.

$$\text{దశాబ్ద వృద్ధి రేటు} = \frac{\text{2001 జనాభా} - \text{1991 జనాభా}}{\text{1991 జనాభా}} \times 100$$

దేశంలో అత్యధిక జనాభా వృద్ధిరేటు 1971 జనాభా లెక్కల్లో 24.8% గా నమోదైంది. తరువాత దశాబ్దంలో నెమ్మదిగా తగ్గుతూ 2001 నాటికి 21.3%కి చేరింది. ఆంధ్రప్రదేశ్‌లో అత్యధిక జనాభా వృద్ధి రేటు 1981 - 91 దశాబ్దంలో అంటే 1991 జనాభా లెక్కల్లో 24.2%గా నమోదైంది. అయితే వెంటనే 2001 జనాభా లెక్కల నాటికి రాష్ట్రం గణనీయంగా 13.86% (14%) తగ్గించుకోగలిగింది. కాబట్టి దేశ జనాభా వృద్ధి రేటు కంటే రాష్ట్ర జనాభా వృద్ధిరేటు తక్కువగా ఉంది. దేశంలో అతి తక్కువ జనాభా వృద్ధిరేటున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడుల తరువాత మూడోస్థానాన్ని దక్కించుకోవడం అభినందనీయం.